ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5 వరంగల్
మంగళవారం 25 జూన్ 2024

అన్నదాతల్లో ఆనందం

వానాకాలం సాగు ప్రారంభం కావటంతో ఇటీవల కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద ఉమ్మడి వరంగల్ జిల్లాలో 3,81,890మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.76కోట్ల37లక్షల80వేల రుపాయలను జమ చేసింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పెట్టుబడి సాయాన్ని కూడా పెంచబోతోంది. జూలై మొదటి వారంలో వానాకాలం పెట్టుబడి సాయం అందించనుంది. గత ప్రభుత్వం ఎకరానికి రూ.5వేల చొప్పున వానాకాలం, యాసంగి పంటలకు రూ.పదివేల అందించింది. అయితే తాము అధికారంలోకి వస్తే రూ.15వేలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలసిందే. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పెట్టుబడి సాయం ఎకరానికి రూ.15వేలు అందనుంది. జూలైలో ఈ సాయాన్ని రైతుల ఖాతాలో వేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. 2023-24 యాసింగిలో రైతుబంధు పథకం కింద ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8,89,787మంది రైతులకు రూ.907.93కోట్ల నిధులు బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ఈసారి ఈ మొత్తం రూ.1,350కోట్లకు పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. మొత్తానికి రూ.2లక్షల రుణమాఫీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయం పెరుగుతుండటంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

- ఒకేసారి రూ.2లక్షల మాఫీకి ప్రభుత్వం కసరత్తు
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- ఆగస్టు 15వ తేదీలోపు రైతులకు చెల్లించేందుకు ప్రణాళిక
- అర్హతలపై మార్గదర్శకాలు రూపొందిస్తున్న సర్కారు
- పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం విధివిధానాలపై అధ్యయనం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8.90లక్షల మందికి రైతుబంధు పథకం
- 3.82లక్షల మందికి సమ్మాన్ నిధి ద్వారా పెట్టుబడి సాయం
- రుణమాఫీకి సుమారు రూ.8వేల కోట్లు అవసరంగా అంచనా



రుణమాఫీ.. రైతు హ్యాపీ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

రైతు రుణమాఫీపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పంద్రాగస్టులోపు రైతులకు రూ.2లక్షల రుణాన్ని ఒకే విడతలో మాఫీ చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రైతు రుణమాఫీపై హామీ ఇచ్చింది. దీంతో ఉమ్మడి వరంగల్‌లో సుమారు 8లక్షల మంది రైతులకు సుమారు రూ.8వేల కోట్ల వరకు రుణమాఫీ జరుగవచ్చునని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అయితే రుణమాఫీని ఎలా చేయాలనే దానిపై మార్గదర్శకాలు రూపొందించేందుకు ప్రభుత్వం ఓ కమిటీని నియమించింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి (పీఎంకేఎస్) పథకంలోని విధివిధానాలపై అధ్యయనం చేస్తున్నారు. కొన్ని మార్పులు, చేర్పులతో అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుండటంతో ఓరుగల్లు అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

డిసెంబరు 9వ తేదీ కటాఫ్

ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా రైతులకు రూ.2లక్షల రుణమాఫీకి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పంద్రాగస్టులోపు పక్కాగారూ.2లక్షల రుణమాఫీ చేయాలనే పట్టుదలతో ప్రభుత్వం ఉంది. దీనిపై ఇటీవల జరిగిన మంత్రి వర్గ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి మంత్రిమండలి ఉపసంఘాన్ని కూడా నియమించారు. ఉపసంఘానికి రుణమాఫీపై పలువురు నుంచి పలు ప్రతిపాదనలు వస్తున్నాయి. అలాగే రూ.2లక్షల రుణమాఫీకి 2018 డిసెంబరు 12వ తేదీ నుంచి 2023 డిసెంబరు 9వ తేదీని కటాఫ్‌గా నిర్ణయించారు. ఈ మధ్యకాలంలో రుణం తీసుకున్న రైతులకే రుణమాఫీ చేయనున్నారు. ఈ ఐదేళ్లలో రైతులు తీసుకున్న రుణంపై వడ్డీని కూడా లెక్కించి మొత్తంగా రూ.2లక్షల వరకు మాఫీ చేయనున్నారు. ఆపైన ఉన్న మొత్తాన్ని రైతులే బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుంది. గోల్డ్ లోనులను మాత్రం ఎట్టి పరిస్థితుల్లో మాఫీ చేసే అవకాశం లేదని సమాచారం.

విధివిధానాలపై ప్రభుత్వం కసరత్తు

పంద్రాగస్టులోపు రుణమాఫీ చేయాలని తీవ్ర కసరత్తు చేస్తున్న సర్కారు.. ఎవరికి వర్తింపజేయాలనే దానిపై తర్జనభర్జన పడుతోంది. వివిధ వర్గాల నుంచి ప్రభుత్వానికి పలు ప్రతిపాదనాలు వస్తుండగా.. ప్రధానంగా ఆదాయపన్ను చెల్లిస్తున్నవారు, ప్రభుత్వ ఉద్యోగులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కూడా రుణమాఫీ నుంచి తొలగించే అవకాశాలున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఐదెకరాల రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తింపజేయాలనే ప్రతిపాదనలు కూడా వస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం విధివిధానాలపైనా అధ్యయనం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. పూర్తి విధివిధానాలను కాకపోయినా కొన్నిటిని అయినా పరిగణనలోకి తీసుకుంటునే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. మరో వైపు తెల్ల రేషన్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకాలను ప్రామాణికంగా తీసుకుని లబ్ధిదారుల జాబితా తయారు చేయాలని కూడా ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం. ఒక ఇంట్లో ఒక్కరికే రుణమాఫీ వర్తిస్తుందని ప్రచారం జరుగుతుండగా.. ఇందుకోసం రేషన్‌కార్డు, ఆధార్‌కార్డులను ప్రామాణికంగా తీసుకోవాలని నిర్ణయించినట్టు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

వివరాల సేకరణలో అధికారులు

కాంగ్రెస్ అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే రుణమాఫీకి అడుగులు వేస్తుండటంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది. అయితే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం విధివిధానాలను పరిగణనలోకి తీసుకుంటే చాలా తక్కువ మందికి రుణమాఫీ జరుగుతుందని, అదే రైతుబంధు విధివిధానాలైతే అత్యధిక రైతులకు ప్రయోజనం చేకూరుతుందని లెక్కలు చెబుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద 3,81,890 మంది రైతులు లబ్ధిపొందుతుండగా వీరికి ఇటీవల కేంద్ర ప్రభుత్వం రూ.76,37,80,000 పెట్టుబడి సాయాన్ని అందించింది. అదే రైతు బంధు పథకం కింద అయితే 8,89,787మంది రైతులకు రూ.907.93కోట్ల సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఈ క్రమంలో రైతుబంధు విధివిధానాలను కొంచెం మార్పులు, చేర్పులు చేసి అమలు చేస్తే ఉమ్మడి జిల్లాలో 8,89,787మంది రైతులు లబ్ధిపొందుతారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వీరికి సుమారు రూ.8వేల కోట్ల వరకు రుణమాఫీ జరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సహకార బ్యాంకులతో పాటు జాతీయ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతుల జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 34 సహకార బ్యాంకుల్లో 78,432మంది రైతులకు రూ.529.44కోట్ల రుణమాఫీ కానుండగా ఇప్పటికే డీసీసీబీ బ్యాంకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అలాగే జాతీయ బ్యాంకుల్లో కూడా వివరాలను సేకరిస్తుండగా.. త్వరలోనే రూ.2లక్షల రుణమాఫీ లబ్ధిదారుల లెక్క తేలనుంది.

ఉమ్మడి జిల్లాలో రైతుబంధు, పీఎం కిసాన్‌సమ్మాన్ నిధి ద్వారా లబ్ధిపొందుతున్న రైతుల వివరాలు

జిలా	రైతుబంధు	పెట్టుబడి సాయం	పీఎంకేఎస్	పెట్టుబడి సాయం
వరంగల్	1,54,822	రూ.137.46కోట్లు	65,361	రూ.13,07,22,000
హనుమకొండ	1,45,044	రూ.132.13కోట్లు	56,409	రూ.11,28,18,000
జనగామ	1,79,735	రూ.202.04కోట్లు	81,487	రూ.16,29,74,000
మహ-బాద్	2,14,685	రూ.233.07కోట్లు	90,978	రూ.18,19,56,000
భూపాలపలి	1,16,171	రూ.118.83కోట్లు	48,496	రూ.09,69.92,000
ములుగు	79,330	రూ.84.40కోట్లు	39,159	రూ.07,83,18,000
మొత్తం	8,89,787	రూ.907.93కోట్లు	3,81,890	రూ.76,37,80,000



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

ముంపు నివారణకు పటిష్ఠ చర్యలు

- అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్ కలెక్టరేట్, జూన్ 24: ముంపు నివారణకు పటిష్ఠ కార్యాచరణ రూపొందించాలని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశపు మందిరంలో వర్షాకాల నేపథ్యంలో ముంపు నివారణకు చేపడుతున్న అభివృద్ధి పనులు, చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ముంపు ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నివారణ కోసం చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామ, మండలం వారీగా రహదారులు, మైనర్ ఇరిగేషన్ పనుల పెండింగ్ వర్క్స్, ముంపు ప్రాంతాల వివరాలు వెంటనే నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, విద్యుత్‌శాఖ, మునిసిపాలిటీ, నీటి పారుదల, విపత్తు నివారణ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, ఆర్డీవో కృష్ణవేణి, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ, మునిసిపల్, వైద్య ఆరోగ్య, నీటి పారుదల, విపత్తు నివారణ శాఖల అధికారులు పాల్గొన్నారు.

28న నగరానికి సీఎం రేవంత్?

అభివృద్ధి పనులపై కలెక్టరేట్‌లో సమీక్ష

హనుమకొండ సిటీ, జూన్ 24: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 28న నగరానికి రానున్నట్టు సమాచారం. నగరాభివృద్ధిపై హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగే సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొంటారని తెలిసింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో వరంగల్ నగర అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలతో పాటు అమలులో ఉన్న పథకాలు, పనులపై సుదీర్ఘ సమీక్ష నిర్వహిస్తారని సమాచారం.



ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల వెల్లడి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 24: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు సోమవారం ప్రకటించారు. వరంగల్ జిల్లాలో ఇంటర్ ఫస్టియర్‌లో 3,183 మంది పరీక్షకు హాజరు కాగా, 1,867 (58.66 శాతం) మంది విద్యార్థులు, సెకండియర్‌లో 2,221 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 1,029 (46.33 శాతం) ఉత్తీర్ణత సాధించారు. హనుమకొండ జిల్లాలో ఫస్టియర్‌లో 12,694 మంది హాజరు కాగా, 8,856 (69.77 శాతం) మంది ఉత్తీర్ణత సాధించగా, సెకండియర్‌లో 4,937 మంది హాజరు కాగా 2,672 (54.12శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు.

నిబద్ధతతో వినతులను పరిష్కరించాలి

- ప్రజావాణి దరఖాస్తులపై త్వరితగతిన స్పందించాలి: కలెక్టర్
- కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో 124 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్య శారదాదేవి



వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్ భూ బాధితులు

వరంగల్ కలెక్టరేట్, జూన్ 24: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన వినతులను నిబద్ధతతో పరిష్కరించాలని కలెక్టర్ సత్య శారదాదేవి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రజావాణిలో మొత్తం 124 వినతులు అందగా ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 84, మహానగర పాలక సంస్థ 4, షెడ్యూల్డ్ కులాల శాఖ 3, నీటి పారుదల శాఖ 2, జిల్లా పంచాయతీ శాక 2, వైద్య ఆరోగ్య శాఖ 2, వ్యవసాయశాఖ 2, పోలీసు శాఖ 3, పౌరసరఫరాల శాఖ, లీడ్ బ్యాంక్, మార్కెటింగ్ శాఖ, గిరిజన అభివృద్ధిశాఖలకు సంబంధించినవి ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, నర్సంపేట ఆర్డీవో కృష్ణవేణి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూ బాధితులకు న్యాయం చేయాలి

- వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్ భూ బాధితులు

రింగ్ రోడ్‌తో భూమి కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. నష్టపరిహారం చెల్లించాలని సంవత్సరాల తరబడి అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎలాంటి ఫలితం లేదని వరంగల్ ఇన్నర్ రింగ్‌రోడ్డు 200ఫీట్ల భూ బాధితులు పేర్కొన్నారు. సుమారు 150 కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వేడుకున్నారు.

ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి

- భట్టు సాంబయ్య, రంగాపురం, నల్లబెల్లి



నల్లబెల్లి మండల కేంద్రంలో రెండేళ్లుగా ఆధార్ సెంటర్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సెంటర్ లేకపోవడంతో 20 కిలోమీటర్ల దూరంలోని నర్సంపేటకు వెళ్లాలి వస్తోంది. ఆధార్ అప్‌డేషన్ కోసం అంత దూరం వెళ్లాలంటే వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లతో మాట్లాడుతున్న కలెక్టర్

రోగులకు మెరుగైన సేవలందించాలి : కలెక్టర్

నర్సంపేట, జూన్ 24 : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సత్యశారదాదేవి వైద్యులను ఆదేశించారు. నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రిని సోమవారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. వార్డుల్లో తిరుగుతూ పరిస్థితులను పరిశీలించి, వైద్య సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని, ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ గోపాల్, సూపరింటెండెంట్ మనోజ్‌లాల్‌ను ఆదేశించారు. ఆస్పత్రికి సంబంధించిన రికార్డులు, ఫార్మసీని మందుల స్టాక్ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కిషన్‌నాయక్, వైద్యులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్‌పార్కును సందర్శించిన కలెక్టర్

గీసుగొండ: శాయంపేటహవేలి శివారులో నిర్మిస్తున్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును కలెక్టర్ సోమవారం సందర్శించింది. భూ వివరాలను, ఏర్పాటైన కంపెనీల గురించి, భూ నిర్వాసితులకు ఇచ్చే వంద గజాల ప్లాట్ల వివరాలను టీఎస్‌ఐఐసీ జెడ్ఎం సంతోష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 28న దక్షిణకొరియా బృందం టెక్స్‌టైల్ పార్కును సందర్శించనున్న నేపథ్యంలో పార్కును కలెక్టర్ సందర్శించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించి చుట్టుపక్కల ముళ్లచెట్లను తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, ఆర్ఐ సాంబయ్య పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న జూనియర్ డాక్టర్లు

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం

- జూనియర్ డాక్టర్ల హెచ్చరిక
- ఎంజీఎంలో ఓపీ సేవల బహిష్కరణ

వరంగల్ మెడికల్, జూన్ 24: సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోవడంతో సమ్మె బాట పట్టినట్లు జూనియర్ డాక్టర్లు పేర్కొన్నారు. కొన్ని రోజులుగా నల్లబ్యాడ్జీలు, కండ్లకు గంతలు కట్టుకొని వివిధ రకాలుగా నిరసన వ్యక్తం చేసిన వైద్యులు.. ప్రభుత్వం స్పందించకపోవడంతో సోమవారం నుంచి సమ్మె బాటపట్టారు. ఎంజీఎంలో ఓపీ విధులు బహిష్కరించి ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం 9గంటలకు ఎంజీఎంలోని గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్న జూనియర్ డాక్టర్లు.. సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం జూనియర్ డాక్టర్ల ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రతీ నెల స్టైపండ్ కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళితే గానీ నిధులు విడుదల కావడం లేదన్నారు. మెడికల్ కాలేజీలు ప్రారంభిస్తే సరిపోదని, వాటిలో కనీస మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఉస్మానియా ఆస్పత్రి భవనం కూలిపోయే దశకు చేరుకుందని, వెంటనే భవన నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేఎంసీలో అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా మారాయని, వెంటనే రోడ్ల నిర్మాణం చేపట్టాలని చెప్పినా పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రీవెన్స్ ఫిర్యాదులకు పరిష్కారం చూపాలి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్



గ్రీవెన్స్‌లో ఫిర్యాదు ఇచ్చేందుకు క్యూ కట్టిన జనం

వరంగల్ కార్పొరేషన్, జూన్ 24: గ్రీవెన్స్ (ప్రజావాణి) కార్యక్రమం ద్వారా స్వీరించిన ఫిర్యాదులపై తక్షణమే పరిష్కారం చూపాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన గ్రీవెన్‌సెల్‌లో కమిషనర్ హాజరై ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు బల్దియాలో 340 శానిటేషన్, 272 ఇంజనీరింగ్, 124 ఎలక్ట్రికల్, 151 ప్రాపర్టీ ట్యాక్స్, 45 డీఆర్ఎఫ్, 6 పెన్షన్స్, 157 హార్టికల్చర్, 22 కుడా, 5 సెప్టిక్ ట్యాంక్‌తో పాటు 58 వివిధ ఫిర్యాదులతో కూడిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అయితే ఫిర్యాదులు ఏ దశలో ఉన్నాయో తెలుసుకుని పరిష్కార మార్గం చూపాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులకు సంబంధించి కోర్టు కేసులుంటే ఏఆర్‌టీ సమర్పించాలని చెప్పారు. ఫిర్యాదులలో ఏమైనా సమస్య ఉంటే పక్కనే రాసిపెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, ఎస్ఈ కృష్ణారావు, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, సిటి ప్లానర్ వెంకన్న, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వో రమేష్, డిప్యూటి కమిషనర్ కృష్ణారెడ్డి, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

విభాగాల వారీగా ఫిర్యాదులు	
ఇంజనీరింగ్ -	46
హెల్త్ అండ్ శానిటేషన్-	07
ప్రాపర్టీ ట్యాక్స్ -	08
టౌన్ ప్లానింగ్	93
మొత్తం	154

ఒకే ఇంటికి రెండు నల్లా బిల్లులు

ఇకే ఇంటికి రెండు నల్లా బిల్లులు రావడంతో హనుమకొండ ఎన్‌జీవోఎస్ కాలనీకి చెందిన మోహన్‌రావు అనే ఇంటి యజమాని గగ్గోలు పెట్టాడు. యేడాదికి రూ.10వేల వరకు నల్లా పన్ను వస్తోందని, ఇది భారంగా ఉందని తెలిపారు. గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు.

పైపులు వేశారు.. నల్లాలు మరిచారు..

కోమటిపల్లి సమీపంలోని నక్షత్రకాలనీలో పైపులు వేసి నల్లాలు బిగించడం మరిచిపోయారని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. ఈ కాలనీ ఏర్పడి 20 యేండ్లు గడుస్తున్నా అన్ని పన్నులు చెల్లిస్తున్నా నల్లా నీరు రావడం లేదని విన్నవించారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందిగా మారిందని, ఎండాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు.

వీధి దీపాలు వెలగడం లేదు..

రెడ్డిపురం ప్రధానరోడ్డు పూర్తిగా అధ్వాన్నంగా మారిందని కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. రోడ్డుపై అడుగులోతు గుంతలు ఏర్పడి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. గతంలో ఫిర్యాదు చేస్తే ఏఈ వచ్చి చూశారని ఇప్పటికీ అతీ గతీ లేదన్నారు. యాదవనగర్ నుంచి ఓఆర్ఆర్‌ను కలిపే రోడ్డును తారురోడ్డుగా వేయాలి

అక్రమ నిర్మాణాలు చేపట్టారు..

గ్రేటర్ వరంగల్ 30వ డివిజన్‌లో వడ్డెరకాలనీ బాలసముద్రం కొన్ని అపార్ట్‌మెంట్లు అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానిక కార్పొరేటర్ రావుల కోమల ఫిర్యాదు చేశారు. కొందరు బిల్డర్లు బల్దియా అధికారులతో కలిసి కుమ్మక్కై అక్రమ నిర్మాణాలు చేస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు తెలిపారు.

● శంభునిపేట: రంగశాయిపేటలోని కాలనీల్లో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రంగశాయిపేట ఆల్ కాలనీస్ డెవలప్ మెంట్ సొసైటీ అధ్యక్షుడు కర్నె రవీందర్ సోమవారం బల్దియా కమిషనర్ తానాజీ వాంకడేకు వినతిపత్రం ఇచ్చారు. సోమవారం బల్దియాలో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా 43వ డివిజన్ వెంకటేశ్వరకాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో పలు కాలనీల బాధ్యులు తమ కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌ను కలిసి వేడుకున్నారు. కార్యక్రమంలో నిమ్మల సదానందం యాదవ్, హరిప్రసాద్, సాంబయ్య, అశోక్, రంగరాజు మోహన్ పాల్గొన్నారు.

అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

- 28న సమీక్షకు సీఎం హాజరవుతారు
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



సమావేశంలో అధికారులతో కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

వరంగల్ కార్పొరేషన్, జూన్ 24: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అర్హులైన ప్రజలకు త్వరలో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయిస్తామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం హనుమకొండ కుడా కార్యాలయంలో మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ రాధికా గుప్తాతో కలిసి గ్రేటర్ వరంగల్ మునిసిపల్ పరిధిలోని పశ్చిమ నియోజకవర్గంలో పలు పథకాల కింద చేపడుతున్న అభివృద్ధి పథకాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ఎమ్మెల్యేతో పాటు అధికారులు పలు అంశాలపై చర్చించు కున్నారు. అర్హులకు రెండు పడకల గదుల కేటాయింపు, వర్షాకాలంలో వరద ముంపు ప్రాంతాల్లో చర్యలు, పారిశుధ్యం, పచ్చదనం, భద్రకాళి బండ్‌పై వజ్రోత్సవ్, వనమహోత్సవ్, స్మార్ట్‌సిటీ అభివృద్ధి పనులపై పురోగతి, కుడా ఆధ్వర్యంలో చేపడుతున్న కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులు, భద్రకాళి మాడవీధుల అభివృద్ధి పనులు, వరంగల్ బస్‌స్టేషన్ నిర్మాణం, ఇన్నర్ రింగ్ రోడ్డు, వరంగల్ మాస్టర్‌ప్లాన్, రోడ్లు భవనాల శాఖ ద్వారా చేపడుతున్న కాజీపేట ఆర్‌వోబీ పనులు, ఇతర అభివృద్ధి పనులపై సమీక్షలో వివిధ విభాగాల వింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్‌రెడ్డి

మిగతా 8వ పేజీలో..

బిర్యానీ సెంటర్లనూ వదలని ఖాకీలు!

పెట్రోలింగ్ పోలీసుల చేతివాటం

రాత్రి వేళల్లో బిర్యానీ పొట్లాలు, చిల్లర వసూళ్లు

వరంగల్ క్రైం, జూన్ 24: కొంతమంది పోలీసుల వైఖరితో ఆ శాఖ పరువు పోతోంది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొందరు పోలీసు అధికారులు అందినకాడికి దండుకోవడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ అడ్డంగా దొరికిపోతున్నారు. రోజువారి వసూళ్లకు తెగబడుతున్న పలువురు పోలీసులు.. చివరకు బిర్యానీ సెంటర్లను సైతం వదలడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ట్రైసిటీస్‌లో ఉన్న బిర్యానీ సెంటర్ల యజమానులు పోలీసులు వైఖరితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిసింది. రాత్రివేళల్లో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు.. బిర్యానీ సెంటర్లను వదలడం లేదనే ఆరోపణలున్నాయి. ప్రధానంగా కాజీపేట సెంటర్, హనుమకొండ, వరంగల్ బస్టాండ్ ఏరియాల్లో పోలీసుల చేతివాటం ఎక్కువగా ఉంటోందని సమాచారం. ప్రస్తుతం నగరంలో బిర్యానీ సెంటర్ల జోరు ఎక్కువగా ఉండటంతో పోలీసులు సైతం అదే స్థాయిలో వీరి వద్ద వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసింది. రాత్రి వేళల్లో బిర్యానీ సెంటర్ల నుంచి ప్యాకింగ్‌లు తీసుకెళ్లడంతోపాటు వ్యాపారాన్ని బట్టి వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. ఆయా పోలీస్‌స్టేషన్‌ల అధికారులు సైతం లంచ్‌లు, డిన్నర్‌లకు బిర్యానీ సెంటర్లపై పడుతున్నట్లు తెలిసింది. స్టేషన్‌ల పరిధిలో ఉన్న పలు బిర్యానీ సెంటర్లకు ఈ నష్టం తప్పడం లేదనే ఆరోపణలున్నాయి. స్టేషన్ నుంచి వచ్చిన ఆర్డర్ అందించకుంటే ఆ బిర్యానీ సెంటర్‌కు రాత్రి వేళ పెట్రోలింగ్ సమయంలో ఇక్కట్లు తప్పవనే ప్రచారం ఉంది. డబ్బులు అడిగే పరిస్థితి ఉండదని సమాచారం. బిర్యానీ సెంటర్ల యజమానులు తెలిసిన వారివద్ద గోడువెల్లగక్కడం మినహా బయటికి చెప్పుకోలేని పరిస్థితి. నిఘా విభాగం అధికారులకు ఈ దందా గురించి తెలిసినా చూసీచూడనట్లు ఉంటున్నారనే విమర్శలున్నాయి.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత



దాడులు చేస్తున్న పోలీసులు

వరంగల్ క్రైం, జూన్ 24: నిషేధిత గుట్కా ప్యాకెట్లను నిల్వపెట్టుకున్న కిరాణం షాపుపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాఘవేంద్ర కిరాణం షాపులో గుట్కా నిల్వలు ఉన్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు.. స్థానిక పోలీసులతో కలిసి సోమవారం దాడులు చేశారు. రూ. 9,780 విలువ కలిగిన సరుకును స్వాధీనం చేసుకుని విక్రయిస్తున్న యజమానిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ధ్రువీకరించారు.

విద్యుత్ అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి

ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూన్ 24: బ్రేక్ డౌన్, ట్రిప్పింగులు జరిగినప్పుడు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ కార్యాలయంలో సోమవారం సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి నోడల్ ఆఫీసర్స్, సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్రేక్‌డౌన్, ట్రిప్పింగ్‌లు జరిగినప్పుడు ప్రతీచోట ప్రత్యామ్నాయ సరఫరా ఉండేవిధంగా చేయాలని సూచించారు. అలాగే పొడవాటి లైన్లు, ట్యాపింగ్ లైన్లు ఉన్న ప్రాంతాల్లో ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్(ఎఫ్‌పీఐ)లు అమర్చాలని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌లు వైఫల్యం చెందినప్పుడు వెంటనే వాటి స్థానంలో కొత్తవి మార్చాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు బి.అశోక్‌కుమార్, టి.సదర్‌లాల్, వి.మోహన్‌రావు, సీజీఎంలు కె.తిరుమల్‌రావు, టి.మధుసుదన్, రాజుచౌహాన్, కె.కిషన్, తదితరులు పాల్గొన్నారు.

ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 24: రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ, డిప్లొమా ఇన్ ప్రీ ఎడ్యుకేషన్‌లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు అర్హత పరీక్షలో 50 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు 45 శాతం మార్కులు ఉండాలని పేర్కొన్నారు. ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన పేర్కొన్నారు. సెప్టెంబరు 1, 2024 వరకు అభ్యర్థులు 17 యేళ్లు నిండాలని తెలిపారు. జూలై 10న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

బాలికను వేధించిన కేసులో ఒకరికి రెండేళ్ల జైలు

వరంగల్ లీగల్, జూన్ 24: మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని వేధించిన కేసులో నేరం రుజువైనందున పోక్సో చట్ట ప్రకారం రెండేళ్ల జైలు శిక్ష, రూ. వేయి జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి కం పోక్సో కోర్టు న్యాయమూర్తి బి.అపర్ణాదేవి సోమవారం తీర్పు చెప్పారు. అదేవిధంగా బాధితురాలికి రూ.50వేల నష్టపరిహారం చెల్లించాలని తీర్పులో ప్రభుత్వాన్ని ఆదేశించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన సింగారపు దిలీప్.. తనను వివాహం చేసుకోవాలని, లేదంటే చనిపోతానని అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికను వేధించేవాడు. ఈ క్రమంలో 2018 ఏప్రిల్ 29న దిలీప్ హైదరాబాద్ నుంచి ఫోన్‌చేసి హైదరాబాద్‌కు వస్తే పెళ్లి చేసుకుందామని, రాకుంటే చనిపోతానని బెదిరించాడు. ఈ విషయంపై బాధితురాలు తల్లిదండ్రులకు తెలుపగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష రూ.వేయి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ అశోక్ సాక్షులను ప్రవేశపెట్టగా కె.పరమేశ్వరి లైజన్ అధికారిగా వ్యవహరించారు. కేసు దర్యాప్తు అధికారులుగా సీఐ ఎ.మహేందర్, ఎస్సై వి.విజయ్‌కుమార్ వ్యవహరించారు. భరోసా లీగల్‌సెల్ అధికారి సీహెచ్. నీరజ కేసుకు సహకరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

మెడికల్ వార్డులో విద్యుత్ అంతరాయం

వరంగల్ మెడికల్, జూన్ 24: ఎంజీఎం ఆస్పత్రిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం తరుచూ జరుగుతూనే ఉంది. సోమవారం రాత్రి 6.30 గంటల నుంచి మెడికల్ వార్డుల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎంఎం ఈస్ట్, ఎంఎం వెస్ట్ రోగులంతా ర్యాంపు వద్దకు చేరుకున్నారు. సుమారు 60 మంది రోగులతోపాటు వారి అటెండెంట్లు చీకట్లోనే కాలం వెళ్లదీశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎంజీఎం ఆస్పత్రిలో తరుచూ విద్యుత్ అంతరాయం ఏర్పడటం పట్ల రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

నవభారత.. సాక్షరత

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4.92 లక్షల మంది వయోజన నిరక్షరాస్యులు
- మొదటి విడతలో లక్ష మందిని అక్షరాస్యులను చేయాలన్నది లక్ష్యం
- ఇప్పటికే ప్రారంభమైన ప్రక్రియ
- సంపూర్ణ సాక్షరతకు ప్రత్యేక ఉల్లాస్ యాప్
- సాక్షర భారత్‌కు భిన్నంగా నవభారత్ సాక్షరత

जन जन साक्षर

హనుమకొండ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ అక్షరాస్యతలో భాగంగా వయోజనులందరినీ అక్షరాస్యులను చేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకు భారత విద్యామంత్రిత్వ శాఖ నవభారత్ సాక్షరత (న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రామ్) కార్యక్రమాన్ని చేపట్టింది. చదువును మధ్యలో మానేసిన విద్యార్థులు, వయోజనులకు చదువు చెప్పాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. గ్రామాలు, పట్టణాల్లో పదిహేనేళ్లు నిండిన నిరక్షరాస్య యువతీ, యువకులను అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దీని అమలులో ప్రభుత్వ ఉపాధ్యాయులే కీలకపాత్ర పోషించబోతుండడం గమనార్హం. రాష్ట్రంలోని ప్రతీ ఉన్నత పాఠశాల నుంచి ప్రధానోపాధ్యాయుడు సహా ముగ్గురు ఉపాధ్యాయులను నియమించాలని నిర్ణయించారు. వీరు ఆ గ్రామ పరిధిలోని నిరక్షరాస్యులైన వయోజనులను గుర్తించి అక్షరాలు నేర్పించేలా కార్యాచరణ రూపొందిచారు.



ప్రతీ పాఠశాల నుంచి ముగ్గురు

నవభారత్ సాక్షరత కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రతీ పాఠశాల నుంచి ముగ్గురు చొప్పున ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోనున్నది. ప్రధానోపాధ్యాయుడిని అక్షరాస్యత పర్యవేక్షకుడి (లిటరసీ సూపర్వైజర్)గా ఓ ఉపాధ్యాయుడిని శిక్షకుడిగా, మరొకరు సర్వేయర్‌గా ఎంపిక చేయనున్నారు. వీరితోపాటు ఆయా గ్రామాల్లోని పొదుపు సంఘాల మహిళలు, పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను భాగస్వాములను చేయనున్నారు. వీరంతా కలిసి వయోజనులను గుర్తించి అక్షరాలు నేర్పిస్తారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 5లక్షల మంది పదిహేనేళ్లు పైబడిన వయోజన నిరక్షరాస్యులున్నారు. వీరిలో లక్ష మందిని మొదటి దశలో అక్షరాస్యులుగా చేస్తారు.

కోడ్ ముగిసింది.. ఇక జోరుగా..

ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ కూడా పూర్తికావడంతో ఈ కార్యక్రమాన్ని వేగంగా అమలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవి సెలవుల్లోనే ప్రారంభించి, కార్యకర్తల ఎంపిక, శిక్షణ పూర్తి చేయాలని నిర్ణయించారు. కోడ్ ముగియడంతో కార్యాచరణ మొదలు పెట్టారు. ముందుగా ప్రతీ పాఠశాల నుంచి ఎంపికైన ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. ఈ తర్వాత అధిక జనాభా ఉన్న గ్రామాల్లో నిరక్షరాస్యులైన వయోజనులను గుర్తించి శిక్షణ ఇస్తారు. శతశాతం అక్షరాస్యతకు ఈ ప్రక్రియ దోహదపడుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ఉల్లాస్ యాప్

కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసేందుకు ప్రత్యేకంగా ఉల్లాస్ (అండ్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) యాప్‌ను ప్రభుత్వం రూపొందించింది. ఉపాధ్యాయులు తమ సెల్‌ఫోన్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని పాఠశాల కోడ్ సహాయంతో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఉనికి, గుర్తింపు తదితర వివరాలు ఇందులో పొందుపరిచారు. తొలి విడతలో కొంత మందిని ఎంపిక చేసి అక్షరాలు నేర్పించేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. కుటుంబసభ్యుల వివరాలు, నివాస ప్రాంతం తదితర అంశాలను పొందుపరుస్తారు. ఈ యాప్ ద్వారా ప్రాథమిక విద్య, డిజిటల్, ఆర్థిక, అక్షరాస్యత, వృత్తినైపుణ్యాలు, క్లిష్టమైన జీవన నైపుణ్యాలను అందిస్తారు. విభిన్న అభ్యాస వనరుల్లో నిమగ్నమవడానికి డిజిటల్ గేట్‌వేగా ఉపయోగపడుతుంది. ఆవాస పద్ధతిలో అధిక జనాభా ఉన్న గ్రామాలను గుర్తిస్తారు. వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నిరక్షరాస్యులైన వయోజనులను గుర్తిస్తారు. మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో నిరక్షరాస్యులైన వయోజనులు ఎక్కువగా ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి.

కలెక్టర్లు చైర్మన్లుగా..

నవభారత సాక్షరతా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఇప్పటికే ఆరు జిల్లాల కలెక్టర్లు విద్యాశాఖ అధికారులతో సమావేశాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నవభారత్ సాక్షరతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నవభారత్ సాక్షరతా కార్యక్రమంలో కలెక్టర్ చైర్మన్‌గా, ఈడీవో మెంబర్ కన్వీనర్‌గా, వయోజన విద్య ఉపసంచాలకుడు లైజన్ అధికారిగా వ్యవహరిస్తారు. నవభారత సాక్షరతా పథకం అమలులో భాగంగా వివిధ రాష్ట్రాలు తమ సౌకర్యాన్ని బట్టి పేర్లను మార్చుకున్నాయి. మన రాష్ట్రంలో దీనిని ఉల్లాస్ నవభారత్ సాక్షరతగా అమలు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 8,30,332 మంది వియోజనులను అక్షరాస్యులుగా చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 50వేల మందిని చేయాలని నిర్ణయించారు. నవభారత సాక్షరత కార్యక్రమం అమలుకు కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40శాతం నిధులను వెచ్చిస్తుంది. జాతీయ నూతన విద్యావిధానం ప్రకారం వచ్చే ఐదేళ్లలో నవభారత సాక్షరత కార్యక్రమం ద్వారా దేశం సంపూర్ణ అక్షరాస్యత సాధించాలన్నది లక్ష్యం. వయోజన విద్యలో భాగంగా 2018 వరకు నిర్వహించిన సాక్షర భారత్ కార్యక్రమానికి భిన్నంగా వ్యక్తి సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా కొత్త కార్యక్రమాన్ని రూపొదించారు. లక్ష్యాన్ని అయిదు దశల్లో పూర్తి చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. 100 రోజుల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు బోధనాభ్యసన సామాగ్రి సిద్ధం చేస్తున్నారు.

ఇలా నేర్పిస్తారు..

వయోజనులకు ఇట్టే అర్థమయ్యేలా సులభంగా చదువు చెప్పనున్నారు. ప్రత్యక్ష తరగతులు, రేడియో, టీవీ సహా సెల్‌ఫోన్‌ద్వారా పాఠాలు నేర్పుతారు. ఇందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. ప్రధానంగా గణితంలో చతుర్విద ప్రక్రియలు సహా జీవన సాఫల్యత గురించి మనోవిజ్ఞానపాఠాలు చెబుతారు. అలాగే నేర్చుకున్న విషయాలపై పరీక్షలు నిర్వహించి అందుకు అనుగుణంగా చర్యలు చేపడతారు. ఎంపిక చేసిన నిరక్షరాస్యులను మొదటి 100 రోజుల్లో రాయడం, చదవడం చిన్న చిన్న లెక్కలు చేయడం నేర్పిస్తారు. 150మార్కులతో తుదిపరీక్ష నిర్వహించి ఉత్తీర్ణ సాధించినవారికి ధ్రువపత్రాలు ఇస్తారు. రెండో దశలో క్రిటికల్ లైఫ్ స్కిల్స్‌లో భాగంగా ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ పరిజ్ఞానం, చట్టాలపై అవగాహన పెంచేలా శిక్షణ ఇస్తారు. ఆరోగ్య పరిరక్షణ, పిల్లల పోషణ, విద్య, కుటుంబ సంక్షేమంపై అవగాహన కల్పిస్తారు. మూడోదశలో 3-5 తరగతులు ప్రాథమిక విద్యగా, 6-8 తరగతులు మాధ్యమిక విద్యగా, 9-12 తరగతులను సెకండరీ విద్యగా అందించేందుకు చర్యలు తీసుకుంటారు. నాలుగో దశలో వృత్తి నైపుణ్యాలు పెంపొందించే శిక్షణ ఇచ్చి, స్థానికంగా ఉపాధి అవకాశం కల్పిస్తారు. అయిదు దశలో శిక్షణ పొందిన వారితో స్వయం సహాయక సంఘాలు, వివిధ సంస్థలు ఏర్పాటు చేసుకొని అభివృద్ధి చెందేలా ప్రోత్సాహం అందిస్తారు.

వయోజన నిరక్షరాస్యులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4,92,449 మంది నిరక్షరాస్యులు ఉన్నారు. వీరిలో నవభారత సాక్షరతా కార్యక్రమం కింద 1,03,646 మందిని అక్షరాస్యులుగా చేయాలని లక్ష్యంగా నిర్ణయించారరు. హనుమకొండ జిల్లాలో 1,12,739 మంది వయోజనులైన నిరక్షరాస్యులు ఉన్నారు. వీరిలో పురుషులు 30,200 మంది కాగా, స్త్రీలు 82,539 మంది. అయితే నవభారత్ సాక్షరతా కార్యక్రమం కింద మొదటి విడతగా 19,250 మందిని అక్షరాస్యులను చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. వరంగల్ జిల్లాలో 86,228 మంది నిరక్షరాస్యులు ఉన్నారు. వీరిలో పురుషులు 30,838 మంది కాగా, స్త్రీలు 55,390 మంది. ఈ జిల్లాలో మొదటి విడతా 19,808 మంది అక్షరాస్యులను చేస్తారు. జనగామ జిల్లాలో 66,419 మంది నిరక్షరాస్యులు ఉన్నారు. వీరిలో పురుషులు 23,151 మంది కాగా, స్త్రీలు 43,268 మంది. వీరిలో నుంచి మొదటి విడత 16,075 మందిని అక్షరాస్యులను చేస్తారు. ములుగు జిల్లాలో 25,473 మంది నిరక్షరాస్యులు ఉన్నారు. వీరిలో పురుషులు 8,825 మంది కాగా, స్త్రీలు 16,648 మంది. వీరిలో మొదటి విడతా 5,046 మందిని అక్షరాస్యులను చేస్తారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 54,777 మంది నిరక్షరాస్యులు ఉండగా, వీరిలో పురుషులు 19,619 మంది, స్త్రీలు 35,158 మంది. వీరిలో మొదటి విడట 19,636 మందిని అక్షరాస్యులను చేస్తారు. మహబూబాబాద్ జిల్లాలో 1,46,813 మంది నిరక్షరాస్యులు ఉన్నారు. వీరిలో పురుషులు 55,643 మంది కాగా, స్త్రీలు 91,170 మంది. వీరిలో మొదటి విడతగా 23,831 మందిని అక్షరాస్యులను చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.

లక్షమంది అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యం



టి. రమేష్‌రెడ్డి, ప్రాజెక్టు ఆఫీసర్, వయోజన విద్య

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4.92 లక్షల మంది నిరక్షరాస్యులున్నారు. మొదటి విడతగా లక్షమందిని అక్షరాస్యులను చేయాలన్నది లక్ష్యం. నవభారత్ సాక్షరతా కార్యక్రమం వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్నది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. గతంలో సాక్షరతా మిషన్‌కు భిన్నంగా ఈ కార్యక్రమం పూర్తిగా ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో పూర్తిగా స్వచ్ఛంద కార్యకర్తల సహకారంతో అమలవుతుంది. పాఠశాల, కళాశాల విద్యార్థులను సైతం ఇందులో భాగస్వాములను చేస్తాం. ఇందుకు సంబంధించిన స్టడీ మెటీరియల్ కూడా సిద్ధమైంది. నవభారత్ సాక్షరతా కార్యక్రమంలో విద్యావంతులైనవారు, విద్యార్థులు అక్షరాస్యులైన ప్రతీ ఒక్కరు పాల్గొని విజయవంతం చేయడం ద్వారా మన దేశాన్ని సంపూర్ణ అక్షరరాస్యతగా మార్చాలి.

ప్రమాదపుటంచున లక్నవరం చెరువు

- తూములో కూలిన రాళ్లు
- మరమ్మతులు చేయిస్తున్న నీటిపారుదల శాఖ



నీళ్లు లేక వెలవెలబోతున్న లక్నవరం సరస్సు

గోవిందరావుపేట, జూన్ 24: ఉయ్యాల వంతెనలు, మధ్యలో దీవులు, చుట్టూ పచ్చని కొండలతో ప్రకృతి రమణీయతకు నిలువుటద్దంగా ఉండే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రఖ్యాత పర్యాటక ప్రాంతం లక్నవరం సరస్సు ప్రమాదంలో పడింది. తూము లోపలి భాగంలో రాళ్లు కూలిపడగా.. ఇటీవల ఆ విషయాన్ని గుర్తించిన నీటిపారుదల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నారు. కాకతీయుల కాలంలో నిర్మితమైన ఈ లక్నవరం సరస్సు 8,794ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తోంది. సుమారు 300ఏళ్లక్రితం నిర్మించినట్టుగా భావిస్తున్న తూములలో గత కొన్నేళ్లుగా లీకేజీలు ఏర్పడ్డాయి. మూడు షెట్టర్లు కలిగిన తూములో ఓ షట్టర్ లోపల రాళ్లు కూలినట్లు నీటిపారుదల శాఖ అధికారులు గుర్తించి తక్షణమే మరమ్మతు చేయకుంటే సరస్సులోకి పూర్తిస్థాయి నీటిమట్టం చేరి ఒత్తిడి పెరిగితే రాతికట్టడమైన తూము కూలిపోయే ప్రమాదముందని భావించారు. తక్షణ మరమ్మతు కోసం ప్రభుత్వానికి నివేదించగా రూ.22లక్షల నిధులు విడుదలవగా వెంటనే పనులు ప్రారంభించారు. పూర్తిగా రాతితో నిర్మించిన తూమును సనాతన పద్ధతిలోనే మరమ్మతు చేయాలని నిర్ణయించారు. కాకతీయుల కాలం నుంచి నైజాం పాలకుల వరకు అనేక కట్టడాలలో అవలంబించిన విధానాన్ని కొనసాగిస్తూ కూలిన రాళ్ల స్థానంలో అంతే వ్యాసార్థం కలిగిన రాళ్లను పేర్చి డంగు సున్నంతో ప్లాస్టరింగ్ చేస్తున్నారు. క్యూరింగ్ కోసం కరక్కాయ, బెల్లం కలిపిన ద్రావకాన్ని ఉపయోగిస్తున్నారు. ఈ తరహా నిర్మాణంలో అనుభవం ఉన్న తమిళనాడుకు చెందిన నిర్మాణ కార్మికులతో పనులు చేయిస్తున్నారు. వారం క్రితం ప్రారంభమైన పనులను జూన్ 30లోపు పూర్తి చేయనున్నారు. వర్షాలు కురిసి అకస్మాత్తుగా వరద ముంచెత్తితో పనులకు అటంకం కలిగే అవకాశముండగా తూముకు పై భాగంలో రింగ్ బండ్‌ను నిర్మించారు. కాగా, మరమ్మతు పనులకోసం సరస్సులోని నీటిని ఖాళీ చేయడంతో 1,945ఎంసీఎఫ్‌టీ సామర్థ్యం కలిగిన సరస్సు డెడ్ స్టోరేజీ స్థాయిలో వెలవెలబోతూ దర్శనమిస్తోంది. వారాంతపు సెలవులు, విడిది కోసం లక్నవరం వస్తున్న పర్యాటకులు కుంటలను తలపిస్తున్న సరస్సును చూసి నిరుత్సాహానికి గురవుతున్నారు. ఈ విషయమై నీటిపారుదల శాఖ డీఈ శ్రీనివాస్ స్పందించారు. 'తూము లోపల ఏర్పడిన గండిని గుర్తించి మరమ్మతు చేస్తున్నాం.. లేకుంటే భవిష్యత్‌లో పెను విపత్తు జరిగి ఉండేది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేస్తున్నాం. ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి పరిస్థితిని నివేదిస్తున్నాం. 25న రాష్ట్రస్థాయి పరిశీలన బృందం లక్నవరం పరిశీలనకు రానుంది. రాష్ట్రంలో తొలిసారి ప్రయోగాత్మకంగా డంగు సున్నం, కరక్కాయ, బెల్లం మిశ్రమాలతో తూముల మరమ్మతులు జరుగుతున్నాయి.. సఫలమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పురాతన రిజర్వాయర్లకు కూడా ఇదే పద్ధతిలో మరమ్మతు పనులు చేసే అవకాశముంది' అని పేర్కొన్నారు.



లక్నవరం చెరువు తూముకు మరమ్మతు చేస్తున్న తమిళనాడు కార్మికులు

వయోవృద్ధులకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాలి



ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, జూన్ 24: ఎంజీఎం ఆస్పత్రిలో వయోవృద్ధులకు ప్రత్యేకవార్డు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దామెర నర్సయ్య కోరారు. సోమవారం ఎంజీఎంలోని వయోవృద్ధుల విభాగాన్ని సందర్శించారు. అనంతరం వారికి అందిస్తున్న సేవలపై ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్‌కు వివరించారు. వయోవృద్ధుల సౌకర్యం కోసం ప్రత్యేక వార్డు ఏర్పాటు చేస్తే సౌలభ్యంగా ఉంటుందని కోరారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగులగాం నరసయ్య, కార్యదర్శి తేరాల యుగంధర్, కార్యవర్గ సభ్యులు గంగారపు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 24: జిల్లా ఉపాధి కల్పన, శిక్షణ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ములుగు రోడ్‌లోని ఉపాధి కల్పన, శిక్షణ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ఉపాధి కల్పన నోడల్ అధికారి ఎం.మల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు కంపెనీలకు చెందిన సుమారు 100 ఉద్యోగాల కోసం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో 50, జేఎస్సార్ సన్‌సిటీ గ్రూప్‌లో 50 ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పాసైన అభ్యర్థులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని ఆయన పేర్కొన్నారు. స్విగ్గీలో రూ.14 వేలతో పాటు రూ.3 వేల ఇన్సెంటివ్ ఉంటుందని, జేఎస్సార్‌లో ఒక్క ప్లాట్ బుక్ చేస్తే రూ.50వేలు కమీషన్ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన 18 నుంచి 45 యేళ్ల మధ్య గల వయస్సు గల వారు 26న ఉదయం 11 గంటలకు ములుగురోడ్‌లోని ఉపాధి కల్పన, శిక్షణ కార్యాలయంలో పాల్గొనాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9848895937 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

'ఇంటర్ సప్లిమెంటరీ'లో శివాని జయకేతనం


ఎ.హాసిని


బి. మమత


కె. కౌషిక్


ఎం. సుష్మిత


జి. హన్సిక

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 24: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో శివాని విద్యార్థులు జయకేతనం ఎగురవేసినట్లు కరస్పాండెంట్ టి.స్వామి చెప్పారు. ఎంపీసీ ఫస్టియర్‌లో చీర్ల సాయిజ 468 మార్కులు, కె.మాధవి 468, ఎం.యశ్వంత్, వి.అజయ్, పి.జెమిని, కె.ఆకాంక్ష, జి.తరుణ్, బి.మనీష, ఆర్.రాజ, సల్మా, ఎ.హర్షిత్ సాయిలకు 467 మార్కులు సాధించారు. బైపీసీ ఫస్టియర్‌లో ఎం.సుష్మిత జి.హన్సిక, ఎ.హాసిని, బి.మమత, కె.కౌషిక్ 437 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా స్వామి ప్రిన్సిపాళ్లు జి.సురేందర్‌రెడ్డి, వి.చంద్రమోహన్, డైరెక్టర్లు టి.రాజు, ఎస్.రమేష్, ఎ.మురళీధర్, వి.సురేష్, ఎస్. సంతోష్‌రెడ్డితో కలిసి విద్యార్థులను అభినందించారు.

విద్యుత్ ప్రజావాణికి 21 దరఖాస్తులు

హనుమకొండ టౌన్, జూన్ 24: వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంలో భాగంగా సోమవారం నిర్వహించిన విద్యుత్ ప్రజావాణికి హనుమకొండ, వరంగల్ సర్కిల్‌లో 21 దరఖాస్తులు వచ్చాయి. కాగా హనుమకొండ సర్కిల్‌లోని హనుమకొండ రూరల్ డివిజన్‌లో 10, టౌన్ డివిజన్‌లో మూడు, మధ్యాహ్నం నిర్వహించిన సర్కిల్ కార్యాలయంలో ఒక దరఖాస్తు వచ్చినట్లు హనుమకొండ ఎస్‌ఈ వెంకటరమణ పేర్కొన్నారు. వరంగల్ సర్కిల్‌లో 8 దరఖాస్తులు రాగా, బిల్డింగ్ విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలపై ఫిర్యాదు చేశారన్నారు.

మానుకోటలో చోరీ సొత్తు రికవరీ

- 24 గంటల్లో దొంగను పట్టుకున్న పోలీసులు
- 1.906 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన టౌన్ సీఐ దేవేందర్

మహబూబాబాద్ రూరల్, జూన్ 24 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న అయ్యప్ప జూవెలరీషాపులో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఈ విషయమై షాపు యాజమాని రున్వాల్ భన్సీలాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు. ఆదివారం క్లూస్‌టీం, పోలీసులు చోరీ జరిగిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బుక్కబజారులో నివాసముంటున్న చత్రి విజయ్‌కుమార్ జిల్లా కేంద్రంలో గుర్ఖాగా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న అయ్యప్ప జూవెలరీషాపు వెనుకభాగం నుంచి పైకప్పులోని పెంకులను తీసి షాపులోకి ప్రవేశించినట్లు చెప్పారు. షాపులో ఉన్న పెద్ద, చిన్న వెండి గిన్నెలు 33, వెండి దీపపు కుందులు 10, వెండి గ్లాసులు 15, చిన్న చెంచాలు 3, వెండి ప్లేట్‌లు 3, కుంకుమ వేసుకునే నాలుగు గిన్నెల సెట్‌లు 2 వెరసి మొత్తం 1.906 కేజీల వెండి అభరణాలను చోరీ చేసినట్లు చెప్పారు. వాటిని ప్లాస్టిక్ సంచిలో తీసుకుని వరంగల్‌లో విక్రయించేందుకు వెళ్తుండగా ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసుల సహకారంతో ఉదయం పాత నేరస్తుడైన చత్రి విజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం చేసినట్లు అంగీకరించాడు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు డోర్నకల్ ప్రాంతాల్లో పలు దొంగతనాలు చేసి జైలుకు వెళ్లాడని, నేరం రుజువు కావడంతో శిక్ష అనుభవించి ఇటీవలే బయటకు వచ్చినట్లు చెప్పారు. ఆ తర్వాత జూవెలరీషాపులో చోరీ చేసినట్లు చెప్పారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్న టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై బి.వి జయ్‌కుమార్, సీఆర్పీ, జీఆర్పీ పోలీసులను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అభినందించారు.



మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో చోరీ వివరాలు వెల్లడిస్తున్న టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్



7వ బ్లాకులో తాత్కాలిక మరమ్మతు పనులు

మేడిగడ్డ బ్యారేజీ వద్ద కొనసాగుతున్న మరమ్మతులు

- పూర్తయిన సీసీ బ్లాకుల పునరుద్ధరణ
- వర్షంతో అన్నారం సరస్వతి బ్యారేజ్ మరమ్మతు పనులకు ఆటంకం

మహదేవపూర్ రూరల్ / మహదేవపూర్, జూన్ 24 : కుంగిన మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాకులో చేపట్టిన తాత్కాలిక మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. సీసీ బ్లాకుల పునరుద్ధరణ పనులు పూర్తి కాగా షీట్‌ఫైల్ అమరిక పనులు పూర్తి కావచ్చాయి. బ్యారేజీకి దిగువన సీసీబ్లాకులతో పాటు దాని కింద ఉన్న కంకర రాళ్లపై ఐరన్ నెట్ వేసే పనులు కొనసాగుతున్నాయి. మట్టినమూనాల సేకరణతో పాటు గ్రౌటింగ్ పనులు కొసాగుతున్నాయి.

సరస్వతి బ్యారేజ్ పనులకు ఆటంకం

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన సరస్వతీ బ్యారేజీకి బుంగలు ఏర్పడిన నేపథ్యంలో మరమ్మతు పనులు జరుగుతుండగా సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి ఆ పనులకు ఆటంకం కలిగింది. పుణేకు చెందిన కేంద్ర జల, శక్తి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తల బృందం నాలుగు రోజులుగా చేస్తున్న పరిశోధనలను నిలిపేసి సుందిళ్ల వద్ద నిర్మించిన పార్వతీ బ్యారేజీకి వెళ్లారు. వాస్తవానికి ఆ బృందం మరోవారం రోజుల పాటు సరస్వతీ బ్యారేజీ వద్దే ఉండాల్సి ఉండగా పనులకు ఆటంకం కలగడంతో వారు సుందిళ్లకు వెళ్లాల్సి వచ్చింది. లీకేజీలు, సీపేజీలు లేకుండా చేయడానికి కెమికల్ గ్రౌటింగ్ తోపాటు జియోఫిజికల్ పరీక్షలకు ఆటంకం కలిగింది. కేవలం డ్రిల్లింగ్ పనులు మాత్రమే జరుగుతున్నాయి.



మహిళాభ్యున్నతికి ప్రభుత్వం కృషి

సంగెం, జూన్ 24: మహిళాభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని డీపీఎం సరిత అన్నారు. సోమవారం పలు గ్రామాల్లోని మహిళ సంఘాల ప్రతినిధులతోపాటు కేంద్ర బృందం సభ్యులతో కలిసి సమావేశమయ్యారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి కావాల్సిన ప్రోత్సాహంపై అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం కిషన్, సీసీలు రాజయ్య, స్వరూప, ఏలియా, సురేష్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



గుంటూరుపల్లిలో ఫుడ్‌ప్రాసెస్ యూనిట్‌ను సందర్శించిన అధికారులు



మార్కెట్ సమస్యలపై చర్చిస్తున్న అధికారులు, చాంబర్ ప్రతినిధులు

మార్కెట్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలి

అధికారులకు చాంబర్ ఆఫ్ కామర్స్ విజ్ఞప్తి

వరంగల్ వ్యవసాయం, జూన్24: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో సోమవారం మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జి మల్లేశం, డీఎంవో ప్రసాదరావు, మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్డితో వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డి ఆధ్వర్యంలో చాంబర్ ప్రతినిధులు, సెక్షన్ బాధ్యులు సమావేశమై మార్కెట్లో పేరుకుపోయిన సమస్యలపై చర్చించారు. యార్డులో క్లీనింగ్ సరిగ్గా చేయకపోవడంతో మిర్చి, దుబ్బతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మ్యాన్‌వల్ క్లీనింగ్‌కు బదులు మిషనరీతో క్లీనింగ్ చేయించాలని, ఇప్పటికే పిలిచిన క్లీనింగ్ టెండర్లను రద్దు చేయాలని అధికారులను కోరారు. మార్కెట్లో వైఫై లేకపోవడంతో తరుచూ ఆన్‌లైన్ ఇంటిగ్రేటెడ్ వేయింగ్ మిషన్లు, పీఓఎస్ మిషన్లకు బ్లూటూత్ నెట్‌వర్క్ పనిచేయక గంటల కొద్ది తూకంలో జాప్యం జరుగుతుందనని వెల్లడించారు. కొత్త పీఓఎస్ మిషన్లను స్పేర్‌లో పెట్టుకోవాలని అధికారులకు తెలిపారు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగతనాలు జరుగుతున్నాయని, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయని వివరించారు. అన్ని యార్డుల్లో తాగునీటి సౌకర్యం చేయించాలని, మార్కెట్‌కు అనుసంధానంగా రోడ్లను శాశ్వత ప్రాతిపాదికన నిర్మించాలని కోరారు. వ్యాపారులను ప్రొఫార్మా 6ఏ కోరిన విధంగా(9 ప్రొఫార్మాలలో) ప్రతీ నెల స్టాక్ వివరాలను సమర్పించాలని కోరుతూ ఎక్స్‌పోర్టు పర్మిషన్ బుక్కులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇప్పటికే జాయింట్ డైరెక్టర్ ఎలాంటి ఇబ్బందులు పెట్టరని హామీ ఇచ్చినా మార్పురాలేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

మాఫియా చేతిలో విద్యారంగం: సీపీఐ



సీపీఐ జిల్లా స్థాయి సమావేశంలో ప్రసంగిస్తున్న శ్రీనివాసరావు

ఖిలావరంగల్, జూన్ 24: కేంద్రంలోని మోదీ పాలనలో విద్యారంగం పూర్తిగా మాఫియా చేతుల్లోకి వెళ్లిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. సోమవారం శివనగర్ తమ్మెర భవనల్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఎమ్డీ అక్బర్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్ష పేపర్ లీకేజీతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేసి రాష్ట్రాల పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా నీట్, నెట్ పరీక్ష పేపర్‌లు లీకైనా ప్రధాని నోరు మెదపడం లేదన్నారు. మరోవైపు నిత్యావసరాలు సహా పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలెండర్ ధరలు పెరిగి సామాన్యులపై పెనుభారం పడుతోందన్నారు. పెరిగిన ధరలకు వ్యతిరేకంగా 26న జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, నిరసన కార్యక్రమాలను చేపడుతామన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కే.బాషుమియా, నాయకులు బుస్సా రవిందర్, అక్కపెల్లి రమేష్, గన్నారపు రమేష్, సంగి ఎలేందర్, గుండె బద్రి, తోట చంద్రకళ పాల్గొన్నారు.

అధ్వానంగా కొత్తవాడ రోడ్లు

• గుంతల్లో నిలిచిన వర్షపు నీరు • పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆటోనగర్, జూన్ 24: నగర రోడ్లు రోజురోజుకూ అధ్వానంగా మారుతున్నాయి. 23వ డివిజన్ కొత్తవాడ రోడ్లే ఇందుకు నిదర్శనంగా మారాయి. ఎక్కడపడితే అక్కడ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో చిన్నపాటి వర్షానికే గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోయి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మరోవైపు రోడ్లు బురదమయంగా మారుతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తవాడలోని పలు ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో పారిశుధ్యం లోపిస్తోంది. స్థలాలు చెత్తచెదారంతో నిండి, వర్షపు నీరు నిల్వ ఉంటుండడంతో దుర్గంధం వ్యాపించడమేకాక, రోగాలబారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. దోమలు వృద్ధి చెందడంతో రాత్రివేళ నిద్రలేని పరిస్థితి ఎదురవుతోందని పేర్కొంటున్నారు. కాలనీల్లో సమస్యలు ఉన్నా ఇటు బల్దియా అధికారులుగానీ, అటు ప్రజా ప్రతినిధులుగానీ స్పందించకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అధ్వానంగా మారిన రోడ్డు



రోడ్లపై నిలిచిన వర్షపునీరు

సమస్యలపై వెంటనే స్పందించాలి



పిట్ట రాములు, చేనేత జాతీయ అవార్డు గ్రహీత, కొత్తవాడ

కొత్తవాడలోని ప్రధాన రోడ్లు గుంతలమయంగా మారాయి. గుంతల్లో పడి వాహనదారులు గురవుతున్నారు. చిన్న వర్షం వస్తే చాలు రోజుల తరబడి రోడ్లపై వర్షపు నీరు నిలుస్తోంది. రెండేళ్ల క్రితం మంజూరైన రోడ్లు ఇప్పటి వరకు మొదలు పెట్టలేదు. కొత్తవాడ రోడ్లు, సమస్యలపై స్థానిక కార్పొరేటర్‌కు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

5వ పేజీ తరువాయి

మాట్లాడుతూ.. వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కాజీపేటలోని ఆర్వోబీ బ్రిడ్జి పనులు నత్తనడకన నడుస్తున్నాయని సంబంధిత అధికారులపై మండిపడ్డారు. వర్షాకాలంలో భారీ వర్షాలు కురిస్తే అభివృద్ధి పనులు నిలిచి పోతాయని, వెంటనే పనులపై అధికారులు దృష్టి సారించాలన్నారు. అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉంటూ ముంపున కు గురయ్యే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ఇబ్బంది రాకుండా చూడాలన్నారు. ఈ నెల 28న వరంగల్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్నారని, ప్రధానంగా కలెక్టర్ కార్యాలయంలో జరిగే సమీక్షలో అండర్ డ్రైనేజీ, స్మార్ట్ సిటీ, ఎంజీఎం సమస్యలు, కుడా మాస్టర్ ప్లాన్, రింగ్‌రోడ్డు అంశాలపై చర్చిస్తారన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ ఆర్డీవో వెంకటేశ్, కుడా పీవో అజిత్ రెడ్డి, బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, డిప్యూటీ కమిషనర్ రవీందర్, సీపీ వెంకన్న, ఆర్‌అండ్‌బీ ఇన్‌చార్జి ఈఈ సురేష్, ఇరిగేషన్ ఈఈ ఆంజనేయులు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు టీషర్టులు అందజేస్తున్న ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ జలజ

క్రీడాకారులకు టీషర్టుల పంపిణీ

పోచమ్మమైదాన్, జూన్ 24: గ్రేటర్ వరంగల్ మూడో డివిజన్‌లోని పైడిపెల్లిలోని హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు సోమవారం టీ షర్టులు పంపిణీ చేశారు. జై జవాన్ -జై కిసాన్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ జలజ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులకు టీ షర్టులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు జన్ను కుమారస్వామి, జనరల్ సెక్రటరీ ఇట్యాల శ్రీనివాస్, పీఈటీ పర్వీన్, క్లబ్ సభ్యులు చెక్కర స్వామి, గట్టు సంపత్, జన్ను రజినికుమార్, జన్ను సారంగపాణి, కోచ్‌లు జన్ను విజయ్‌కుమార్, గణిపాక హరీష్ పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రభుత్వానిది సవితి తల్లి ప్రేమ

రాయపర్తి, జూన్ 24 : విద్యార్థులపై కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సవితి తల్లి ప్రేమను చూపుతోందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్ వీర్ ఆరోపించారు. టీజీపీఎస్సీ ఎదుట బీజేవైఎం నాయకులపై దాడి చేసిన ఘటనను నిరసిస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మను సోమవారం రాయపర్తిలోని రహదారిపై దగ్ధం చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ ఎనగందుల శ్రావణ్ కుమార్, కార్యదర్శి జక్కుల సదీప్, రాసాల రాకేష్, భాస్కర్, రాజు, సిద్దార్థ్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ కలెక్టరేట్, జూన్ 24: ఎస్సీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్‌లో 100 మంది అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతోందని, ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి పి.భాగ్యలక్ష్మీ ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీ, ప్రొఫెషనల్ డిగ్రీ ఉత్తీర్ణులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీసీఈ, పీడబ్ల్యూడి అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. జూన్ 10వ తేదీ లోపు టీటీడబ్ల్యూఆర్‌జీటచిజ్యూ.చిౌ.జీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 040 - 23546552, 8121626423 నెంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

బీరన్నస్వామి ఆలయ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ కమిటీ సభ్యులు

కరీమాబాద్, జూన్ 24: అండర్ రైల్వేగేటు ప్రాంతంలోని కరీమాబాద్ బీరన్నస్వామి దేవస్థానం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. కరీమాబాద్‌లోని ఆలయ ప్రాంగణంలో కురుమ కుల పెద్దలు దయ్యాల పురుషోత్తం, మండల రాజు ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోరె సదానందం, కార్యదర్శిగా కోరె నాగరాజు ఎన్నికయ్యారు. కోశాధికారిగా నరిగె లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా దయ్యాల కృష్ణ, సహాయ కార్యదర్శిగా దయ్యాల సుధాకర్, ముఖ్య సలహాదారులుగా కంకల మల్లేశం, కోరే కుమారస్వామి, బండారి రాజేశ్వర్, మండల కొమురెల్లి, ఆర్గనైజర్లుగా నంద నవీన్, గొట్టె సదానందం, కుండే క్రాంతి, కార్యవర్గ సభ్యులుగా రాజు, తిరుపతి, శ్రీనివాస్, శంకర్, వేణు, శ్రీనివాస్, చిన్న రవి, అరవింద్, రాజులు ఎన్నికయ్యారు.

మెడికల్ కళాశాలను పరిశీలించిన అధికారులు



ఎన్ఎంసి ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారదాదేవి

నర్సంపేట, జూన్ 24 : నర్సంపేట పట్టణం సమీపంలో నిర్మిస్తున్న జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను సోమవారం కలెక్టర్ సత్యాశారదాదేవితో కలిసి నేషనల్ మెడికల్ కౌన్సిల్ ప్రతినిధులు పరిశీలించారు. ఎన్ఎంసి నిబంధనల ప్రకారం ఉండాల్సిన పనులపై ఆరా తీశారు. కళాశాల నిర్వాహణ, ఆస్పత్రిలో సేవలందించేందుకు అవసరమైన బోధన, బోధనేతర సిబ్బంది, ఇతర మౌలిక వసతులు, పరికరాల గురించి అడిగి తెలుసుకున్నారు. కళాశాల భవన నిర్మాణం పనుల్లో పురోగతిని పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. మెడికల్ కళాశాలకు 50 సీట్లు మంజూరైనట్లు తెలుసుకున్నారు. ఎన్ఎంసి పరిశీలన పూర్తయినందున మెడికల్ కళాశాల నిర్వాహణ కోసం త్వరలో అనుమతులు రాగానే ప్రారంభిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ కిషన్ నాయక్ తెలిపారు.

పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వృద్ధురాలి మృతి



గిర్మాజీపేట, జూన్ 24 : పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన ధర్మారం రైల్వే గేటు సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. వరంగల్ జీఆర్‌పీ సీఐ జీ.నరేష్ కథనం ప్రకారం. గీసుగొండ మండలం ధర్మారం గ్రామానికి చెందిన గట్టికొప్పుల ఎల్లమ్మ(73) తన చిన్నకుమారుడుతో ఉంటోంది. సోమవారం తెల్లవారుజామున నిద్రలేచిన ఎల్లమ్మ ధర్మారం మెయిన్ రోడ్డుపై ఉంటున్న పెద్ద కుమారుడు రమేష్ ఇంటికి వస్తూ, రైల్వేగేటు సమీపంలో డౌన్‌లైన్‌లో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పెద్ద కుమారుడు రమేష్‌కు అప్పగించి, అతడిచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ పి.రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ జరిగిన ప్రాంతాన్ని సందర్శించిన ఏసీపీ



వరంగల్ చౌరస్తా, జూన్ 24: కాశిబుగ్గ వివేకానం దకాలనీలో ఆదివారం రాత్రి చోరీ జరిగిన ఇంటిని సోమవారం వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, సీఐ మచ్చ శివకుమార్‌లు పరిశీలించారు. కాలనీలో 7వ నంబర్ రహదారిలో నివాసం ఉన్న గుండు సదానందం తాను నిర్మిస్తున్న ఇంటి నిర్మాణం కోసం తెచ్చుకున్న రూ.6.50 లక్షలు నగదుతోపాటు 15 తులాల బంగారం తాళాలు పగులగొట్టి ఎత్తుకెళ్లార ని బాధితుడు వాపోయాడు. చోరీ జరిగిన సంఘట నపై రెండు క్రైం పార్టీలను ఏర్పాటు చేసి కేసు ద ర్యాప్తు చేస్తున్నారు. ఏసీపీ పరిసర ప్రాంతాలను సీఐతో కలిసి పరిశీలించి బాధితుడిని వివరాలు అడి గి తెలుసుకున్నారు. సీసీ పుటేజ్‌లను పరిశీస్తున్నారు.

వాహనదారులకు జరిమానా

మట్టెవాడ, జూన్ 24: వరంగల్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా, మద్యం తాగి వాహనం నడిపిన వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి సోమవారం జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ శ్రీధర్ తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ వాహనదారునికి రూ. వెయ్యి, మద్యం తాగి వాహనం నడిపిన 13మంది వాహనదారులకు రూ. 15,200 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

మాత, శిశు సంరక్షణ సేవలు సక్రమంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

పోచమ్మ మైదాన్, జూన్ 24: జిల్లాలో అమలవుతున్న మాత, శిశు సంరక్షణ సేవల ను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం మాత, శిశు సంరక్షణ సేవలపై పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ గర్భిణి వివరాలు నమోదు చేయాలని, మూడు పరీక్షలు ఉచితంగా నిర్వహించి, ధనుర్వాత టీకా, ఐరన్ పోలిక్‌యాసిడ్, మందులుఅందించాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, ప్రకాష్‌రెడ్డి, సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ వద్ద ధర్నా

నెక్కొండ, జూన్ 24 : రాష్ట్రంలో అమలు అవుతున్న మల్టీపర్పస్ విధానంతో జీపీ కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని జీపీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య అన్నారు. సోమవారం నెక్కొండ జీపీ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీ కార్మికులకు శ్రమకు తగిన వేతనాలను ఇవ్వకుండా వెట్టిచాకిరికి గురిచేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి 26 కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా కార్యక్రమం చేపడుతున్నా మని కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు వీరస్వామి, సాయిలు, మదారు, ఉపేంద్ర, సూరమ్మ, శ్రీనివాస్, కర్ణాకర్, యాకయ్య, సబిత, రాధిక, రాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.

వెల్లువెత్తిన ప్రజాపాలన దరఖాస్తులు



బల్దియాలో దరఖాస్తులు సమర్పించేందుకు బారులుతీరిన జనం

వరంగల్ కార్పొరేషన్, జూన్ 24: ప్రజాపాలన దరఖాస్తుల సవరణలకు ప్రజలు బల్దియా కార్యాలయంతో పాటు మీసేవా కేంద్రాలకు పోటెత్తారు. కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాలను కలుపుకుని 11 సెంటర్లలో ప్రజాపాలన దరఖాస్తులు అందించేందుకు ప్రజలు బారులు తీరారు. మూడు రోజుల్లోనే అన్ని సెంటర్‌లను కలుపుకుని సుమారు 2,500 వరకు దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు వెల్లడించారు. అయితే దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రజాపాలన కౌంటర్లు పెంచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి

శంభునిపేట, జూన్ 24 : పోలీసు సిబ్బంది విధులతోపాటు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని మెడికవర్ హస్పిటల్, వాసన్ ఐ కేర్‌ల సౌజన్యంతో మామునూరు టీజీఎస్‌పీ ఫోర్త్ బెటాలియన్‌లో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథి శివప్రసాద్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో 300మంది సిబ్బందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు కృష్ణప్రసాద్, శ్రీనివాస్, వీరన్న, ఆర్‌ఐలు శోభన్‌బాబు, పురుషోత్తంరెడ్డి, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, అశోక్, వేంకటేశ్వర్లు, కృష్ణ, డాక్టర్ అన్వేషిణి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పంట రుణాలు అందించాలి



తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న నేతలు

సంగెం, జూన్ 24: రైతులకు వెంటనే పంట రుణాలు అందించాలని అఖిల భారత రైతు సమైక్య కన్వీనర్ గోనే రాంచందర్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు సమైక్య నాయకులు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతు భరోసా డబ్బులను వెంటనే విడుదల చేసి రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఖరీఫ్‌లో పంట వేసిన ప్రతీ రైతుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌కు అనుగుణంగా రుణాలివ్వాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జక్క అశోక్, అయిలయ్య, సాంబయ్య, రవి, శ్రీనివాస్‌పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL మంగళవారం 25 జూన్ 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

'మాజీ మంత్రి హరీశ్‌రావు రాజీనామాకు సిద్ధంగా ఉండాలి'

వర్ధన్నపేట రూరల్, జూన్ 24 : కాంగ్రెస్ ప్రభుత్వం సకాలంలో రుణమాఫీ చేస్తే మాజీ మంత్రి హరీశ్ రావు తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని తెలిపాడని, అనుకున్న సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీని చేసేందుకు సిద్ధమయ్యారని, రాజీనామాకు హరీశ్‌రావు కూడా సిద్ధం కావాలని కాంగ్రెస్ నేషనల్ వర్కర్స్ కమిటీ జిల్లా అధ్యక్షుడు కుల్ల యాకాంతం డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ల్యాబర్తి గ్రామంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రైతాంగానికి సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి ఆచరణలో చూపెడుతున్నాడని అన్నారు.



కుల్ల యాకాంతం

మెడికల్ కళాశాలను పరిశీలించిన కలెక్టర్, ఎన్ఎంసీ ప్రతినిధులు



ఎన్ఎంసీ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారదాదేవి

నర్సంపేట, జూన్ 24 : నర్సంపేట పట్టణం సమీపంలో నిర్మిస్తున్న జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను సోమవారం కలెక్టర్ సత్యశారదా దేవితో కలిసి నేషనల్ మెడికల్ కౌన్సిల్ ప్రతినిధులు పరిశీలించారు. ఎన్ఎంసి నిబంధనల ప్రకారం ఉండాల్సిన పనులపై ఆరా తీశారు. కళాశాల నిర్వాహణ, ఆస్పత్రిలో సేవలందించేందుకు అవసరమైన బోధన, బోధనేతర సిబ్బంది, ఇతర మౌలిక వసతులు, పరికరాల గురించి అడిగి తెలుసుకున్నారు. కళాశాల భవన నిర్మాణం పనుల్లో పురోగతిని పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. మెడికల్ కళాశాలకు 50 సీట్లు మంజూరైనట్లు తెలుసుకున్నారు. ఎన్ఎంసి పరిశీలన పూర్తయినందున మెడికల్ కళాశాల నిర్వాహణ కోసం త్వరలో అనుమతులు రాగానే ప్రారంభిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ కిషన్ నాయక్ తెలిపారు.

చేపల వేటకు వెళ్లిన జాలరిపై మొసలి దాడి



చికిత్స పొందుతున్న చంద్రమౌళి

ఖానాపురం, జూన్ 24 : మండలంలోని పాకాల సరస్సులో చేపల వేటకు వెళ్లిన ఓ జాలరీపై ఆదివారం మొసలి దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం... బుధరావుపేట గ్రామానికి చెందిన జాలరి చాట్ల చంద్రమౌళి చేపలు విక్రయిస్తూ జీవనం గడుపుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం పాకాల సరస్సులో చేపలు పట్టడానికి మహేందర్ అనే వ్యక్తితో కలిసి వెళ్లాడు. సరస్సులోకి దిగి చేపలు పట్టడానికి వల వేస్తుండగా చంద్రమౌళిపై మొసలి దాడి చేయడంతో చంద్రమౌళి కేకలు పెట్టాడు. ఒడ్డున ఉన్న మహేందర్ వల విసరగా చంద్రమౌళి పట్టుకోవడంతో ఒడ్డుకు లాగి మొసలి బారినుంచి రక్షించాడు. మొసలి దాడిలో చంద్రమౌళి కాళ్లు, తొడలు, మర్మాంగాలకు తీవ్రగాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్త వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

రేపటి కలెక్టరేట్ వద్ద ధర్నాకు తరలిరండి

నెక్కొండ, జూన్ 24 : రాష్ట్రంలో అమలు అవుతున్న మల్టీ పర్పస్ విధానంతో జీపీ కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని జీపీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య అన్నారు. సోమవారం నెక్కొండ జీపీ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీ కార్మికులకు శ్రమకు తగిన వేతనాలను ఇవ్వకుండా వెట్టి చాకిరికి గురిచేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారంకు గాను బుధవారం కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా కార్యక్రమం చేపడుతున్నామని కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు వీరస్వామి, సాయిలు, మదారు, ఉపేంద్ర, సూరమ్మ, శ్రీనివాస్, కర్ణాకర్, యాకయ్య, సబిత, రాధిక, రాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.

నేడు పట్టణంలో విద్యుత్‌కు అంతరాయం

వర్ధన్నపేట, జూన్ 24 : నేడు వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిధిలోని జగ్గపేట, డీసీ తండాతో పాటు రూరల్ ఫీడర్‌లో సైతం విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు వర్ధన్నపేట ఏడీఈ కన్న రాజు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల పునరుద్ధరణలో భాగంగా ఉదయం 8 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడి, తిరిగి యథావిధంగా అందుతుందని స్పష్టం చేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

దుగ్గొండి, జూన్ 24 : మండలంలోని తొగర్రాయిలో గ్రామంలో ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందిన హన్మ కొండ రఘు కుటుంబానికి గ్రామస్థులు సేకరించిన రూ:1,64,000లు సోమవారం మృతుడి కుటుంబానికి అందించారు. రఘుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. గ్రామస్థులు ఏకమై విరాళాలు సేకరించి ఆర్థిక సాయంగా అందించారు. ఆర్థికసాయం అందించిన వారిలో ఎంపీపీ కాట్ల కోమలభద్రయ్య, మాజీ సర్పంచ్ ఓడేటి తిరు పతిరెడ్డి, ఆవుల నర్సింహారెడ్డి, తుమ్మలపెల్లి మహేందర్, యార శ్రీనివాస్, నల్ల పోశయ్య తదితరులు ఉన్నారు.

ఇక విద్యార్థులకు ద్వి భాష పాఠ్యపుస్తకాలు



రెండు వైపులా తెలుగు, ఆంగ్లం భాషల్లో ప్రచురణ

వర్ధన్నపేట, జూన్ 24 : మారుతున్న కాలానుగుణంగా మార్పులు చేసుకుంటూ ప్రభుత్వ విద్య ఉత్తమ ఫలితాలు సాధిస్తోంది. ఆంగ్ల మాధ్యమం ద్వారా ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించే అవకాశం ఉంది. ఇందుకుగాను పాఠ్యాంశాల రూపకల్పనలో విద్యార్థులు సులువుగా అర్థం చేసుకుంటే మెరుగైన ఫలితాలు సాధిస్తామని విద్యాశాఖ భావిస్తోంది. ఈ క్రమంలో గత మూడేళ్ల క్రితం నుంచి 8వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టింది. ఏటా ఒక్కో తరగతి పెంచుతూ ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం బోధించనున్నారు. గతంలో సక్సెస్ పాఠశాలల పేరిట కొన్ని ఉన్నత పాఠశాలలను మాత్రమే ఆంగ్ల మాధ్యమంలో బోధన కొనసాగించారు. 2022-23 విద్యా సంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రారంభించారు. విద్యార్థులు పాఠాలు తేలికగా అర్థం చేసుకునేందుకు పుస్తకాల ముద్రణలో మార్పులు చేశారు. ఇందులో భాగంగా పాఠ్య పుస్తకాల్లో పాఠ్యాంశాన్ని ఒక పక్క తెలుగు, మరోవైపు ఆంగ్లంలో ముద్రించడం విశేషం.

పంపిణీకి ఏర్పాట్లు ..

బడి గంటలు మోగిన నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం నుంచి ద్విభాష పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే ఉచిత పాఠ్యపుస్తకాలు మండల రిసోర్స్ సెంటర్‌కు చేరుకోగా మండలంలోని పాఠశాలలకు పంపిణీ ప్రక్రియ కొనసాగుతుంది. అయితే గత విద్యా సంవత్సరం వరకు 9వ తరగతి వరకు ద్విభాషలో ప్రచురితమైన పుస్తకాలు పంపిణీ చేయగా, ఈ విద్యాసంవత్సరం నుంచి టెన్త్ విద్యార్థులకు ఆ మాదిరిగా పుస్తకాలు అందజేయనున్నారు.

రెండు విభాగాలుగా పుస్తకాలు ..

ప్రతీ పుస్తకాన్ని ఆంగ్లం, తెలుగులో ముద్రిస్తే పుస్తకం పేజీల సంఖ్య రెట్టింపై విద్యార్థులకు బరువు పెరగకుండా రెండు విభాగాలుగా విభజించారు. పార్ట్ -1 , పార్ట్ -2 పేరిట విభజించిన రెండు పుస్తకాలను జూన్ నుంచి అక్టోబర్ వరకు మొదటి భాగం, నవంబర్ నుంచి మార్చి వరకు రెండవ విభాగాలుగా విద్యార్థులకు ఈ సంవత్సరం నుంచి టెన్త్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. తద్వారా ద్వి భాషా పాఠ్యపుస్తకాల వల్ల విద్యార్థులు సులభతరంగా నేర్చుకునేందుకు వీలుంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

కొత్తహంగులతో పుస్తకాలు ..

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే పుస్తకాలు కొత్త హంగులతో రూపొందించారు. ఆకట్టుకునే చిత్రాలు, కవర్ పేజీలతో ఉండనున్నాయి. పేజీలోని పాఠం పూర్తి వివరాల కోసం, సంబంధిత వీడియోల క్యూఆర్ కోడ్‌ను ముద్రించారు. మొబైల్‌తో స్కాన్ చేయగానే అదనపు సమాచారంతో కూడిన వీడియో, ఫొటోలు అందుబాటులోకి వచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఇవి విద్యార్థులకు సరికొత్త ఆకర్షణీయంగా ఉన్నాయి.

తేలికగా పాఠం అర్థమవుతుంది

సుహాస్, పదవ తరగతి విద్యార్థి

ఒకే పుస్తకంలో ఆంగ్లం, తెలుగు భాషల్లో ఉండడం వల్ల పాఠాలు సులభంగా అర్థం చేసుకోగలుగుతున్నాం. గతంలో పదాలకు అర్థం తెలియకుంటే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకునే వారిమి. పక్కనే తెలుగులో ఉండటం వల్ల తేలికగా పాఠాన్ని అర్థం చేసుకోగలుగుతున్నాం. ప్రస్తుతం పదవ తరగతిలో పుస్తకం తెలుగు, ఆంగ్ల భాషలో ఉండటం వల్ల ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంది.

విద్యార్థులకు అవగాహన సులభం

హనుమకొండ సుధాకర్, రిటైర్డ్ ఎంఈవో



గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పాఠం అవగాహన కోసం సులభతరం అవుతోంది. తెలుగు, ఆంగ్లం రెండు భాషల పుస్తకాల విధానం ద్వారా మెరుగైన ఫలితాల సాధనకు తోడ్పడుతుంది. ఉపాధ్యాయులకు ఉపయోగం, పుస్తకాలు రెండు విభాగాలు ఉండడం వల్ల విద్యార్థులపై భారం ఉండదు.

రైతులకు పంట రుణాలు అందించాలి



నర్సంపేట తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగికి వినతి పత్రం అందజేస్తున్న ఏఐకేఎఫ్, ఎంసీపీఐ(యూ) నాయకులు

నర్సంపేట టౌన్, జూన్ 24 : ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా వెంటనే రుణాలు అందించాలని కోరుతూ ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ (ఏఐకేఎఫ్), ఎంసీపీఐ (యూ)ఆధ్వర్యంలో సోమవారం నర్సంపేట తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎఫ్, ఎంసీపీఐ(యూ) నాయకులు కేశెట్టి సదానందం, కొత్తకొండ రాజమౌళిలు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులందరికి పంట రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు ఇస్తామని ప్రకటించి ఇప్పటికీ అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. పంట వేసిన ప్రతీ రైతుకు, కౌలు రైతులతో సహ స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ సూచన మేరకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనుమాల రమేష్, జన్ను రమేష్, గుర్రం రవి, అచ్చానాయక్, నర్సింహస్వామి, శ్రీనివాస్, యాదగిరి పాల్గొన్నారు.

● దుగ్గొండి: స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రైతులకు పంట రుణాలు అందించాలని ఎంసీపీఐ(యూ) అనుబంధ రైతు సంఘం ఏఐకేఎఫ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం ఆందోళన నిర్వమించి స్థానిక తహసీల్దార్ రవిచంద్రారెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుంభ బాబురావు మాట్లాడగా, నాయకులు నాగెల్లి కొంరయ్య సింగతి మల్లికార్జున్, ఎల్లబోయిన రాజు, పేరబోయిన ఐలోని, బుడిమే సురేందర్ పాల్గొన్నారు.

● నల్లబెల్లి: పంట వేసిన ప్రతి రైతుకు బ్యాంకు ద్వారా ఏలాంటి షరతులు లేకుండా పంట రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని అఖిల భారత రైతు సమాఖ్య జిల్లా నాయకుడు దామ సాంబయ్య కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయ అధికారికి వినతి పత్రాన్ని ఏఐకేఎఫ్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో ఏఐకేఎఫ్ నాయకులు నాగెల్లి యోసోబ్, కొత్తగొల్ల రాజయ్య, శ్రీకాంత్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

● సంగెం: రైతులకు వెంటనే పంట రుణాలు అందించాలని అఖిల భారత రైతు సమైఖ్య కన్వీనర్ గోనే రాంచందర్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు సమైక్య నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు భరోసా డబ్బులను వెంటనే విడుదల చేసి రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఖరీఫ్‌లో పంట వేసిన ప్రతీ రైతుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌కు అనుగుణంగా రుణాలివ్వాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జక్కు అశోక్, ఆయిలయ్య, సాంబయ్య, రవి, శ్రీనివాస్‌పాల్గొన్నారు.

● చెన్నారావుపేట : రైతులకు బ్యాంకు ద్వారా పంట రుణాలను అందిచాలని తహసీల్దార్ ఫణికుమార్‌కు ఎంసీపీఐయూ నాయకులు వినతి పత్రాన్ని అందించారు. ఎంసీపీఐయూ పార్టీ మండల కార్యదర్శి జన్ను రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం పంటల రుణాలను మాఫీ చేయటంతో పాటు కొత్త రుణాలను అందించాలన్నారు. రైతులకు ఇబ్బందులు పడకుండా పాకాల వాగుపై బ్రిడ్జి నిర్మాణాన్ని చెన్నారావుపేటలో చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనువాస్, అచనాయక్, గోరి మియా తదితరులు పాల్గొన్నారు.

కోళ్లఫాం రద్దు చేయాలి

ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి తండావాసుల వినతి



ఎమ్మెల్యేకి వినతి పత్రం అందిస్తున్న తండావాసులు

రాయపర్తి, జూన్ 24 : మండలంలోని పన్యానాయ్ తండాలో ఏర్పాటు చేయబోతున్న కోళ్ల ఫారాన్ని రద్దుచేసి, ప్రజల ప్రాణాలు కాపాడాలని సోమవారం తొర్రూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ వెంకట్రాం, ఎంపీటీసీ క్రాంతి, గిరిజన శక్తి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ భూక్యా రాజారాం నాయక్‌లు మాట్లాడుతూ కోళ్ల ఫారం బాధితులకు తగు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సునావత్ కిషన్ నాయక్, లక్పతి, శంకర్ నాయక్, బుచ్చన్న, బాలాజీ, జవహర్‌లాల్, సుగుణమ్మ, లక్ష్మి, దస్సీ పాల్గొన్నారు.

సైడ్ కాల్వల నిర్మాణ పనులు ప్రారంభం

చెన్నారావుపేట, జూన్ 24 : మండలంలోని చెరువుకొమ్ముతండాలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న సైడ్ కాల్వల నిర్మాణ పనులను జడ్పీటీసీ బానోతు పత్తినాయక్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల నాయకులు బోడ బద్దునాయక్, డాక్టర్ హరిశంకర్, బీఆర్ఎస్ బోడ మురళినాయక్, కోర్ర హలిసింగ్, వెంకన్న సుమన్, భద్రు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి

నెక్కొండ, జూన్ 24 : వరంగల్ జిల్లాలోని ఎరువుల విక్రయాల షాపుల్లో రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించడమే కాకుండా తప్పకుండా బిల్లులను ఇవ్వాలని ఎమ్మార్పీఎస్‌టీఎస్ రాష్ట్ర కోర్ కమిటి సభ్యుడు ఈదునూరి యాకయ్య డిమాండ్ చేశారు. సోమవారం నెక్కొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎరువుల, పురుగుమందుల విక్రయషాపులపై సంబంధితాధికారులు పర్యవేక్షణ చేయాలని ఆయన కోరారు.

కట్టపై తుమ్మచెట్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

నెక్కొండ, జూన్ 24 : మండలంలోని పెద్దకొర్పోలులోని ఊరచెరువు కట్టపై ఉన్న తుమ్మచెట్లను అక్రమంగా తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. పెద్దకొర్పోలు గ్రామ ఎంపీటీసీ కర్ర సుకన్య, ఆమె భర్త చెన్నారెడ్డిలు అక్రమంగా తుమ్మచెట్లను తొలగించి విక్రయిస్తున్నారని వారు ఆరోపించారు. తుమ్మలను తొలగించడం వల్ల గొర్రెలు, మేకలకు మేత కరువవుతుందని, ప్రభుత్వ స్థలంలోని చెట్లను తొలగించిన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి మధుకర్, నాయకులు గడ్డల సతీష్, దయ్యాల ఐలయ్య దయ్యాల వెంకన్న, భిక్షపతి, కొమురయ్య, కట్టయ్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ఎంట్రెన్స్‌లో అర్షియాజాబిన్‌కు 408వ ర్యాంక్



విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

నెక్కొండ, జూన్ 24 : నెక్కొండ మండల కేంద్రలోని విద్యోదయ హై స్కూల్ విద్యార్థినీ ఎండీ అర్షియాజాబిన్ 2024లో నిర్వహించిన పాలిటెక్నిక్ఎంట్రెన్స్‌లో రాష్ట్రస్థాయిలో 408 ర్యాంక్ సాధించిందని పాఠశాల కరస్పాండెంట్ చల్లా నాగార్జున్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో అర్షియా జాబిన్‌ను అభినందించి జ్ఞాపికను అందించారు. విద్యార్థులు విద్యను నిర్లక్ష్యం చేయకుండా కష్టపడి చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చల్లా పారిజాతం, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎండీ షరీఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి ప్రభుత్వం కృషి

సంగెం, జూన్ 24 : మహిళాభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని డీపీఎం సరిత అన్నారు. సోమవారం పలు గ్రామాల్లోని మహిళ సంఘాల ప్రతినిధులతోపాటు కేంద్ర బృందం సభ్యులతో కలిసి సమావేశమయ్యారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి కావాల్సిన ప్రోత్సాహంపై అడిగి తెలుసుకున్నారు. మహిళ సంఘాల ద్వారా ప్రభుత్వం ఫుడ్ ప్రాసెస్ యూనిట్‌లను ఏర్పాటుచేసేందుకు సిద్ధంగా ఉందని సంఘాలు పేర్కొన్నాయి. కార్యక్రమంలో ఏపీఎం కిషన్, సీసీలు రాజయ్య, స్వరూప, ఏలియా, సురేష్ పాల్గొన్నారు.

'కారంపూడి'కి ఇంటర్నేషనల్ ఆస్ట్రో ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం



అవార్డును అందుకుంటున్న కృష్ణమూర్తి

నర్సంపేట టౌన్, జూన్ 24 : నర్సంపేట మండలం కమ్మపల్లికి చెందిన వాస్తు సిద్ధాంతి డాక్టర్ కారంపూడి కృష్ణమూర్తికి ఇంటర్నేషనల్ వేదిక్ ఆస్ట్రాలజీ ఫెడరేషన్ వారు ఇంటర్నేషనల్ ఆస్ట్రో ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేశారు. ఈ నెల 23న ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఫెడ రేషన్ వార్లు కృష్ణమూర్తికి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ అవార్డును అందజే యడంతో పాటు ఫెడరేషనల్‌లో లైఫ్ టైమ్ మెంబర్ షిప్‌ను ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. అవార్డు రావ డంతో తనపై బాధ్యతను మరింత పెంచిందన్నారు.

శ్రావణ్‌శాస్త్రికి ...



అవార్డును అందుకుంటున్న శ్రావణ్‌శాస్త్రి

నెక్కొండ : నెక్కొండ మండలానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, వేద జ్యోతిష పరిశీలకులు బూర్గుపల్లి శ్రావణ్‌శాస్త్రికి ఇంటర్నేషనల్ వేదిక్ ఆస్ట్రోలజీ ఫెడరేషన్ ఐవిఎఫ్ఎ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఆస్ట్రో ఎక్సలెంట్ అవార్డును న్యూఢిల్లీలోని ఇంటర్‌నేషనల్ రాడిసన్ బ్లూ హోటల్‌లో అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శ్రావణ్‌శాస్త్రి మాట్లాడుతూ తనకు అవార్డును అందించిన ఇంటర్నేషనల్ వేదిక ఆస్ట్రాలోజీ ఫెడరేషన్ డైరెక్టర్లు డాక్టర్ మనీష్‌శర్మ, దివ్యపిళ్ళై, అల్కాశర్మలకు శ్రావణ్‌శాస్త్రీ కృతజ్ఞతలు తెలిపారు.

అధిక ఫీజుల వసూళ్లను అరికట్టాలి

నర్సంపేట, జూన్ 24 : ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్ళను అరికట్టాలని లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజా వత్ వాసూనాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్ట ణంలో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రైవేటు పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులను వసూలు చేస్తున్నా అధికారులు పట్టించు కోవడం లేదన్నారు. ప్రైవేటు పాఠశాలలో పుస్తకాలు, నోటుబుక్స్, యూనిఫామ్‌ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రు లను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. మండల విద్యా శాఖాధికారులు స్పందించి ప్రైవేటు పాఠశాలలో ఫీజుల దోపిడీని అరికట్టాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూలీనాయక్, వాలియా, రాజునాయక్, వీరన్ననాయక్, రాఘ్దన్‌నాయక్, భాస్కర్‌నాయక్, లాలు, రామచంద్రు నాయక్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వర్ధన్నపేట, జూన్ 24 : వర్ధన్నపేట మునిసిపాలిటీ కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో, రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సోమవా రం పరామర్శించి ఓదార్చారు. పట్టణంలోని 2వ వార్డుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు వడ్లకొండ శ్రీనివాస్-సరితల కుమారుడు సాయిచరణ్ లివర్ సంబంధిత వ్యాధితో ఏంజీ ఆస్పత్రిలో మృతిచెందగా తల్లిదండ్రులను, అలాగే 10వ వార్డుకు చెందిన గాయల బాబు ఈ నెల 18న రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా భార్య లక్ష్మీ, కుమారుడు అన్వేష్, కుమార్తెలు స్వాతి, అకిల, శ్రావణిలను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. 4వ వార్డు భవానికుంటతండాకు చెందిన అంగోత్ కిషన్‌నాయక్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రభుత్వపరంగా అన్ని విధాల అండగా ఉంటూ ఆదుకుంటామని హామీఇచ్చారు. ఈ పరామర్శలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ, కౌన్సిలర్లు సమ్మెట సుధీర్, తుమ్మల రవీందర్, మంచాల రామకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ కమ్మగోని ప్రభాకర్‌గౌడ్, నాయకులు పోశాల వెంకన్న, ఎండి.అఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.

● పర్వతగిరి : మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన వారి కుటుంబాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సోమవారం పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు జిల్లా ధర్మయ్య తండ్రి జిల్లా రాములు, సముద్రాల బుచ్చమ్మ, మట్ట కుమారస్వామి,కల్లెడకు చెందిన బాల్లె ముత్తయ్యలు మృతిచెందగా వారికుటుంబాలను పరామర్శించారు. ఈ పరామర్శలో జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్, ఎంపీటీసీ బొట్ల మహేంద్ర, యూత్‌కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందికట్ల అనీల్, సొసైటీ డైరెక్టర్ గంగాధర్‌రావు, నాయకులు సునీల్‌రావు, రాంచందర్, మాసాని సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తాం

వర్ధన్నపేట, జూన్ 24 : సబ్ డివిజన్ పరిధిలో ఏర్పడిన విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని వర్ధన్నపేట విద్యుత్ ఏడీఈ కన్న రాజు హామీ ఇచ్చారు. సోమవారం పట్టణంలోని విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ సమస్యల పరిష్కారాల కోసం ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు సమస్యలు కలిగిన వినియోగదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆయనమాట్లాడుతూ ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్న 1 గంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను దరఖాస్తుల ద్వారా వివరించాలని కోరారు. వినియోగదారుల ఫిర్యాదులను పరిశీలించి, సకాలంలో పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ దయాకర్, సిబ్బంది పంజా కృష్ణ, నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రభుత్వానిది సవతి తల్లి ప్రేమ

రాయపర్తి, జూన్ 24 : విద్యార్థుల పై కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సవితి తల్లి ప్రేమను చూపుతోందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్ వీర్ ఆరోపించారు. టీజీపీఎస్సీ ఎదుట బీజేవైఎం నాయకులపై దాడి చేసిన ఘటనను నిరసిస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మను సోమవారం రాయపర్తి మండల కేంద్రంలోని వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై దగ్ధంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగాల నోటిఫికేషన్ ఎన్నికల కోసమే తప్ప నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం ఆలోచించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ ఎనగందుల శ్రావణ్ కుమార్, కార్యదర్శి జక్కుల సదీప్, రాసాల రాకేష్, భాస్కర్, రాజు, సిద్దార్థ్, సంతోష్, నవీన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

(5వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ.. వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కాజీపేటలోని ఆర్వోబీ బ్రిడ్జి పనులు నత్తనడకన నడు స్తున్నాయని సంబంధిత అధికారులపై మండిపడ్డారు. వర్షాకాలంలో భారీ వర్షా లు కురిస్తే అభివృద్ధి పనులు నిలిచిపోతాయని, వెంటనే పనులపై అధికారు లు దృష్టి సారించాలన్నారు. అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉంటూ ముంపున కు గురయ్యే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ఇబ్బంది రాకుండా చూడాలన్నారు. ఈ నెల 28న వరంగల్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్నారని, ప్రధానంగా కలెక్టర్ కార్యాలయంలో జరిగే సమీక్షలో అండర్ డ్రైనేజీ, స్మార్ట్ సిటీ, ఎంజీఎం సమస్యలు, కుడా మాస్టర్ ప్లాన్, రింగ్‌రోడ్డు అంశాలపై చర్చిస్తారన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ ఆర్డీవో వెంకటేశ్, కుడా పీవో అజీత్‌రెడ్డి, బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, డిప్యూటీ కమిషనర్ రవీందర్, సీపీ వెంకన్న, ఆర్అండ్‌బీ ఇన్‌చార్జి ఈఈ సురేష్, ఇరిగేషన్ ఈఈ అంజనేయులు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.